క్లుప్తంగా

ఏప్రిల్ 3 నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు

జగద్గిరిగుట్ట: చింతల్ పద్మానగర్ కాలనీలోని శ్రీదేవి, భూదేవీ సహిత కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయ 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 3 నుంచి 8 వరకు జరగనున్నట్లు ఆలయ కమిటీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. పూజల్లో భాగంగా 6న ఉదయం శ్రీనివాస కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. కల్యాణంలో పాల్గొనదలచి వారు రూ. 500 చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 99853 06633, 9885556691, 9290588249లో సంప్రదించాలని కోరారు.

అభినందనలు



అనీష్‌కు బ్యాట్ అందజేస్తున్న శ్రీధర్

కుత్బుల్లాపూర్ : పాఠశాల స్థాయిలోనే క్రికెట్‌లో రాణిస్తున్న కుత్బుల్లాపూర్ పద్మానగర్ ఫేస్-1కు చెందిన శ్రీనివాస్, స్వప్న దంపతుల కుమారుడు అనీష్ నందాల (12) ను సెయింట్ పీటర్స్ బోయిన్‌పల్లి యాజమాన్యం మెమోంటోతో సత్కరించింది. వరుసగా మూడు సెంచరీలు చేసినందుకు మాజీ హెచ్‌సీఏ క్రీడాకారుడు శ్రీధర్ మధునాల ఆదివారం అనీష్ బ్యాట్‌ను అందజేశారు. అనీష్ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే రెండు పోటీలకు సిద్ధమవుతున్నాడు.. ఆదివారం పలువురు మాజీ క్రీడాకారులు కోచ్ హరీష్‌తో కలిసి అనీష్‌ను అభినందించారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం

సుభాష్‌నగర్: కాలనీలు, మురికివాడల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని సుభాష్ నగర్ డివిజన్ కార్పొరేటర్ హేమలత సురేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం పలు కాలనీల ప్రతినిధులు కార్పొరేటర్‌ను కలిసి స్థానిక సమస్యలను ఆమె దృష్టికి తెచ్చారు. బ్రాహ్మణ బస్తీ లో మురుగు నీటి సమస్య, మైత్రీనగర్‌లో సిమెంట్ రోడ్డు నిర్మాణం, ప్రియాంక నగర్‌లో నూతన కమ్యూనిటీ భవన నిర్మాణం చేపట్టాలని ఆయా సంక్షేమ సంఘాల ప్రతినిధులు కోరారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందిస్తూ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కుత్బుల్లాపూర్: వేసవికాలంలో ప్రతి అప్రమత్తంగా ఉండాలని, వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ నిర్మల సూచించారు. జ్వరాలతో బాధపడుతున్న వారు సూరారం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ కోవిడ్ టెస్టులు చేయించుకోవాలని సూచించారు. ఆదివారం 12 మందికి పరీక్షలు నిర్వహించగా ఎవరికి కోవిడ్ లక్షణాలు లేవని ఆమె పేర్కొన్నారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలి

జగద్గిరిగుట్ట: విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని జగద్గిరిగుట్ట సబ్ స్టేషన్ డీఈ రాధాకిషన్ అన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలో 13న భగత్‌సింగ్ నగర్ గవర్నమెంట్ స్కూల్ వద్ద, 14న దేవమ్మ బస్తీ గణేష్ మండపం వద్ద, 15న రాజీవ్ గృహకల్ప, సంజయ్‌పురి కాలనీ కమ్యునిటీ హాల్ వద్ద బిల్లుల చెల్లింపు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు..

సుభాష్‌నగర్: మరమ్మతుల కారణంగా గాజుల రామారం సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. కైలాస్ హిల్స్, మహాదేవపురం ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మద్యం మత్తులో పెట్రోల్ బంక్ సిబ్బందిపై దాడి

దుండిగల్: తాగిన మైకంలో ముగ్గురు యువకులు పెట్రోల్ బంక్ సిబ్బందిపై దాడి చేసిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అత్తాపూర్ ప్రాంతానికి చెందిన రామ్‌లాల్ గుప్తా బహదూర్‌పల్లిలో శ్రీ సిద్ధి వినాయక ఫిల్లింగ్ స్టేషన్ నిర్వహిస్తున్నారు. అతని వద్ద శ్రీకాంత్, అనిల్ పని చేస్తున్నారు. శనివారం రాత్రి బైక్‌పై పెట్రోల్ బంక్‌కు వచ్చిన ముగ్గురు యువకులు బైక్‌లో పెట్రోల్ పోయాలని కోరగా మిషన్ ఆగిపోయిందని, ఐదు నిమిషాలు సమయం పడుతుందని సిబ్బంది చెప్పారు. దీంతో ఆగ్రహానికి లోనైన వారు మాకే ఎదురు చెప్తావా అంటూ అనిల్, శ్రీకాంత్‌లపై దాడి చేసి పారిపోయారు. యజమాని రామ్‌లాల్ గుప్తా ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేటి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు

అంతా సిద్ధం

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 14 పోలింగ్ కేంద్రాలు.. 6,536 మంది ఓటర్లు

- ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లిన అధికారులు, సిబ్బంది
- డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పర్యవేక్షించిన కలెక్టర్ అమయ్‌కుమార్



సాక్షి,మేడ్చల్ జిల్లా: హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం ఎన్నికలకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధికార యంత్రాంగం అంతా సిద్ధం చేసింది. ఈ నెల 13వ తేదీ సోమవారం (నేడు) జరుగనున్న ఈ ఎన్నికల నేపత్యంలో ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలోని ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో 14 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలతో పాటు సిరా, ఇతర సామగ్రిని ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, సిబ్బందికి అప్పగించారు. వీరంతా వారికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో పోలీసు బందోబస్తు నడుమ కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. కాగా ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్ అమయ్‌కుమార్ పర్యవేక్షించగా ఇందులో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, డీఆర్ఓ లింగ్యానాయక్, కలెక్టరేట్ ఏఓ వెంకటేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

29,720 మందిలో 6,536 జిల్లా ఓటర్లే...

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 14 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. ఇందులో ఎనిమిది కీసరలో, ఆరు పోలింగ్ కేంద్రాలను మల్కాజిగిరిలో ఏర్పాటు చేశారు. ఈ నెల 13వ తేదీ సోమవారం (నేడు) ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమై సాయంత్రం వరకు ఎన్నికలు పటిష్ట భద్రతల నడుమ జరగనున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ నియోజకవర్గం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మొత్తం ఓటర్లు 29,720 ఉండగా.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 6,536 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళా ఓటర్లు 3,498 మంది కాగా.. పురుష ఓటర్లు 3,038 మంది ఉన్నారు.

సాధారణ ఎన్నికల మాదిరిగానే...

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను సాధారణ ఎన్నికల మాదిరిగానే నిర్వహించేందుకు ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులను నియమించారు. అలాగే ఎన్నికలు జరిగే అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ ద్వారా ఎప్పటికప్పుడు ఎన్నికల ప్రక్రియను పరిశీలించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులను ఎల్బీనగర్‌లోని సరూర్‌నగర్ స్టేడియంకు పోలీసు బందోబస్తు మధ్య తరలిస్తారు. 16న సరూర్‌నగర్ స్టేడియంలో ఓట్ల లెక్కింపు జరగనుంది.

బరిలో 21 మంది.. ప్రధాన పోటీ ఇద్దరి మధ్యే..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రత్యక్షంగా రాజకీయ పార్టీలతో సంబంధం లేకపోయినప్పటికీ.. ఆయా అభ్యర్థులకు పరోక్షంగా పలు పార్టీలు ఆర్థిక వనరులను సమకూర్చాయి. ఎలాగైనా ఈ సీటును మళ్లీ తమ ఖాతాలో వేసుకోవాలని అధికార బీఆర్‌ఎస్ యత్నిస్తుండగా.. సీపీఎం, బీజేపీ, కాంగ్రెస్, సీపీఐలు కూడా తమ అనుబంధ సంఘాల అభ్యర్థుల గెలుపు కోసం గట్టిగానే ప్రయత్నిస్తున్నాయి. మూడు జిల్లాల పరిధిలో మొత్తం 21 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో టీఎస్ యూటీఎఫ్ తరఫున పాపన్నగారి మాణిక్‌రెడ్డి పోటీ చేస్తుండగా, పీఆర్‌టీయూ నుంచి చెన్నకేశవరెడ్డి, టీపీఆర్‌టీయూ అభ్యర్థిగా ప్రస్తుత మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం అభ్యర్థిగా ఏవీఎన్ రెడ్డి, టీయూటీఎఫ్ అభ్యర్థిగా దేవన్నగారి మల్లారెడ్డి, ఎస్టీయూ నుంచి భుజంగరావు, మహబూబ్‌నగర్ నుంచి గతంలో పోటీ రిటైర్డ్ డీఈఓ విజయ్ కుమార్, హర్షవర్ధన్‌రెడ్డిలు పోటీలో ఉన్నారు. గత



ఎన్నికల్లో 12 మంది అభ్యర్థులు బరిలో నిలవగా, వీరిలో జనార్దన్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, ఏవీఎన్ రెడ్డిల మధ్య తీవ్రపోటీ జరిగింది. తొలి ప్రాధాన్యత ఓటు దక్కకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్లతో జనార్ధన్‌రెడ్డి విజయం సాధించారు. ఈ సారి ఎన్నికల్లో టీఎస్‌యూ టీఎఫ్ అభ్యర్థి మాణిక్‌రెడ్డి, పీఆర్‌టీయూటీ అభ్యర్థి చెన్నకేశవరెడ్డిల మధ్యే ప్రధాన పోటీ కన్పిస్తోంది.

పోలింగ్ స్టేషన్లు, ఓటర్ల వివరాలు ఇలా..

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓటర్లు
మహబూబ్‌నగర్	15	3,461
నాగర్‌కర్నూల్	14	1,822
వనపర్తి	7	1,335
జోగులాంబ గద్వాల్	11	877
నారాయణపేట్	5	664
రంగారెడ్డి	31	9,186
వికారాబాద్	18	1,890
మేడ్చల్	14	6,536
హైదరాబాద్	22	3,949
మొత్తం	137	29,720

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



చింతల్ డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కేపీ వివేకానంద్ అన్నారు. ఆదివారం ఆయన 'ప్రగతి యాత్ర'లో భాగంగా చింతల్ 128 డివిజన్‌లో పర్యటించారు. వివేకానంద నగర్, శ్రీనివాస్ నగర్ కాలనీల్లో పర్యటించిన ఎమ్మెల్యే రహదారులు తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలు తెలుసుకున్నారు. పనులన్నీ త్వరలోనే పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు.ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ తంగ లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకులు మహ్మద్ మక్సూద్ అలీ, బస్వరాజు, వెంకటేష్ గౌడ్, ప్రభాకర్ గుప్త, చలమా రెడ్డి, చందు, వహీద్ ఖురేషి, మహిళా అధ్యక్షురాలు స్వప్న, సీనియర్ నాయకురాలు విజయ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- గాజులరామారం 125 డివిజన్ పరిధిలోని చంద్రగిరి నగర్ శ్రీ సంత్ శిరోమణి రవిదాస్ మోచీ సంఘం ఆధ్వర్యంలో చంద్రగిరి నగర్ నుంచి ఎల్లమ్మ బండ వరకు చేపట్టిన రవిదాస్ మహారాజ్ శోభా యాత్రను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ప్రారంభించారు.
- సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని సుభాష్ నగర్ విశ్వకర్మ మందిర్ లో బీహార్ అసోసియేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'హోలీ మిలన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

14న ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నా

నిజాంపేట్: బీజేపీ పాలనలో దేశవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ రిజర్వేషన్లు , ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మార్చి 14న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు కేవీపీఎస్ మేడ్చల్ జిల్లా నాయకుడు బాలపీరు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీజేపీ అధికారం చేపట్టిన తర్వాత దేశ వ్యాప్తంగా దళితులపై దాడులు పెరిగిపోయాయన్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని ఆరోపించారు. కులమతాలకు అతీతంగా అందరూ మహాధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించండి

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బంజారా సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ సంఘం సభ్యులు ఆదివారం డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్‌కు వినతి పత్రం అందజేశారు. సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణం కోసం స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నిజాంపేట్ బంజారా సేవా సంఘ్ అధ్యక్షుడు రాములు నాయక్, ఉపాధ్యక్షుడు రామచంద్రనాయక్, రవీందర్, పరమేశ్, పాండు, రవి, కృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

సాక్షి,మేడ్చల్ జిల్లా: మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో సోమవారం (నేడు) జరగనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దుచేస్తున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు.

నేడు 14 పాఠశాలలకు సెలవు..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలుగా గుర్తించిన 14 పాఠశాలలకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శం



బిఆర్‌ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న, రంగరాయ ప్రసాద్

నిజాంపేట్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు దేశానికే ఆదర్శమని డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్ అన్నారు. ఆదివారం నిజాంపేట్‌లోని 11వ వార్డులో కార్పొరేటర్ రవికిరణ్ ఆధ్వర్యంలో పలు పార్టీలకు చెందిన నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రంగరాయ ప్రసాద్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ పటిష్టత కోసం ప్రతి కార్యకర్త పని చేయాలని సూచించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు కార్యకర్తలు అందరు సన్నద్ధం కావాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జగన్ యాదవ్, రామక్రిష్ణ ,రాజేశ్ వర్మ, బొట్టు శ్రీనివాస్ రావు, మంజునాథ్, శేషగిరి, సుధీర్‌వర్మ, దశరథ్, నరేంద్ర, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి



జీడిమెట్ల గ్రామంలో పర్యటిస్తున్న భరతసింహారెడ్డి..

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల గ్రామంలో రోడ్డు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి అధికారులను కోరారు. ఆదివారం ఆయన జీడిమెట్ల గ్రామంలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని కోరారు. గాయత్రీ నగర్ మెయిన్ రోడ్‌లో జరుగుతున్న పనులను, గోదారి హోమ్స్, గాయత్రి నగర్ కాలనీ వాసులతో కలిసి కోల్ నాలా పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సుమేర్ సింగ్, మాధవ రెడ్డి, సుభాష్, రాజు, బీరప్ప, దేవేందర్, జే రాజు, బ్రిజేష్, సంజీవరెడ్డి, అరవింద్, సతీష్, వెంకు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

దుండిగల్: అనుమానాస్పద స్థితిలో చెరువు సమీపంలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది.పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా, దోమడుగు గ్రామానికి చెందిన దాకూరి శ్రీనివాస్(46) ప్రైవేట్ ఉద్యోగి. ప్రతి నెల కుమ్మరి సంఘం చిట్టీ డబ్బులు చెల్లించేందుకు దుండిగల్‌కు వచ్చి వెళుతుంటాడు.చిట్టీ డబ్బులు కట్టేందుకు శనివారం మధ్యాహ్నం బైక్‌పై దుండిగల్‌కు వచ్చాడు. మధ్యాహ్నం 2గంటల నుంచి అతడి భార్య ఫోన్ చేసినా స్పందించలేదు. సాయంత్రం ఇంటికి వచ్చిన కుమారుడు పవన్ కల్యాణ్‌కు విషయం చెప్పడంతో అతను తండ్రి కోసం పరిసర ప్రాంతాల్లో గాలించాడు. ఆదివారం ఉదయం దుండిగల్ చెరువు సమీపంలోని రాయిపై బైక్, ఫోన్, చెప్పులు కనిపించాయి. పక్కనే తల,ముఖంపై తీవ్రగాయాలతో శ్రీనివాస్ మృతి చెంది ఉన్నాడు. చిట్టి డబ్బులు చెల్లించిన అనంతరం సంఘం సభ్యులతో కలిసి శ్రీనివాస్ మద్యం తాగినట్లు సమాచారం. మద్యం మత్తులో బహిర్భూమికి వెళ్లిన అతను ప్రమాదవశాత్తు కింద పడి చనిపోయాడా.. వేరే కారణాలేమైనా ఉన్నాయా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు పవన్ కల్యాణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య



గాయత్రి మృతదేహం

జీడిమెట్ల: భర్త కుటుంబాన్ని పట్టించుకోవడం లేదని మనస్తాపానికి లోనైన ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ పవన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కుత్బుల్లాపూర్ విలేజ్‌కు చెందిన ఎర్రోళ్ల గాయత్రి(26) వెంకటేష్ పదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం. కాగా గత కొద్ది రోజులుగా వెంకటేష్ కుటుంబాన్ని పట్టించుకోకుండా జులాయిగా తిరుగుతున్నాడు. భర్త తన తీరు మార్చుకోవాలని గాయత్రి పలుమార్లు అతడిని కోరింది. అయినా వెంకటేష్ వైఖరిలో మార్పురాకపోవడంతో మనస్తాపానికిలోనైన గాయత్రి ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని అత్మహత్యకు పాల్పడింది.బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మంత్రి చామకూర మల్లారెడ్డి



ఘట్‌కేసర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి మల్లారెడ్డి

ఘట్‌కేసర్: అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన అంబేడ్కర్ విగ్రహానికి పూలమల సమర్పణ వందో వారం కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ శ్రీనివాస్, టీఎస్ ఎస్‌జీడీసీఎఫ్ చైర్మన్ బాలరాజ్ యాదవ్, ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్మన్ పావనీయాదవ్, పోచారం చైర్మన్ కొండల్‌రెడ్డితో కలిసి మంత్రి మల్లారెడ్డి విచ్చేసి పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం ఎస్వీఎస్ ఫంక్షన్ హాలులో జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. అంబేడ్కర్ సబ్బండ వర్గాల ప్రజల అభివృద్ధి, అంటరానితనం, కుల నిర్మూలన కోసం పోరాటం చేశాడని, దళితుల సామాజిక, రాజకీయ హక్కుల కోసం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లేశ్, ప్రబుద్ధ భారత్ నిర్వాహకుడు అరుణ్ కుమార్, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు జంగమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్లు మాధవరెడ్డి, రెడ్యానాయక్, రైతు బంధు మండల కోఆర్డినేటర్ అంజిరెడ్డి, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ బీ-బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, సర్పంచులు గోపాల్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రతాపసింగారంలో..

ప్రతాపసింగారంలో జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, సర్పంచ్ శివశంకర్‌తో కలిసి మంత్రి మల్లారెడ్డి అంబేడ్కర్ విగ్రహానికి మొదటి పూలమాల వేశారు.

కాలనీల అభివృద్ధికి పాటుపడాలి



కార్పొరేటర్ రావుల శేషగిరిని కలిసిన నూతన కమిటీ సభ్యులు..

సుభాష్‌నగర్: సంక్షేమ సంఘాలు కాలనీల అభివృద్ధికి కృషి చేయాలని గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. నూతనంగా ఏర్పడిన కైలాస్ హిల్స్ కమిటీ సభ్యులు ఆదివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ స్థానికంగా నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ యాదయ్య, వైస్ ప్రెసిడెంట్ సంపత్ కుమార్ సత్యనారాయణ, జనరల్ సెక్రటరీ సుబ్బారావు, ట్రెజరర్ సత్యనారాయణ రావు, అసిస్టెంట్ ట్రెజరర్ బి.రమణ, జాయింట్ సెక్రటరీ సీహెచ్ సురేష్, సిద్ధిరామరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం రవీందర్ రెడ్డి. భాస్కర్, నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

బాలాజీ ఎన్‌క్లేవ్ సమస్యలను పరిష్కరిస్తా



బాలాజీ ఎన్‌క్లేవ్‌లో పర్యటిస్తున్న మంత్రి మల్లారెడ్డి

కీసర: బాలాజీ ఎన్‌క్లేవ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ అహ్మద్‌గూడ 4వ వార్డు పరిధిలో గల బాలాజీ ఎన్‌క్లేవ్ కాలనీలో ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్, వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు వెంకటేష్, కొత్త సురేఖభాస్కర్‌గౌడ్, కొత్త హేమలతశ్రీనివాస్‌గౌడ్, నానునాయక్‌లతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో కాలనీ పక్కనే ఉన్న చీర్యాల పెద్ద చెరువు వాగు వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను కాలనీవాసులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యను పరిష్కరించేందుకు త్వరలో రూ.50 లక్షలు మంజూరయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కౌకుట్ల తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం

జవహర్‌నగర్: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం లాంటిదని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ 17వ డివిజన్ శాంతినగర్‌కు చెందిన మురుగన్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన చెక్కును ఆదివారం మంత్రి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సుబ్రహ్మణ్యం, కాలనీవాసులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత వైద్య సేవలు



రక్తదానం చేస్తున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

దుండిగల్: అరుంధతి ఆస్పత్రిలో పేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని ఆస్పత్రి అధినేత, బీఆర్‌ఎస్ నాయకులు మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఇప్పటి వరకు 2వేలకు పైగా ఉచిత శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. ఆదివారం ఆయన దుండిగల్‌లోని ఆస్పత్రిలో తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ×గిఫ్ట్ ఏ స్మైల్₹ నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకుని పేదలకు ఉచితంగా చికిత్సలు అందిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో సేవలను మరింత విస్తరిస్తామన్నారు. తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం తమ కళాశాల విద్యార్థులు రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



శ్రీ హోమ్స్ కాలనీ సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ కొలను వీరేందర్‌రెడ్డి

నిజాంపేట్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బాచుపల్లి 18వార్డు కార్పొరేటర్ కొలను వీరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం శ్రీహోమ్స్ కాలనీలో బాలాజీ సూపర్ స్పెషాలిటీ డెంటల్ ఆసుపత్రి, ఇంప్లాంట్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దంత పరీక్షల నిమిత్తం వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జీవన శైలిలో మార్పులు, ఆహారపు అలవాట్ల కారణంగా పలువురు చిన్న వయసులోనే పంటి సమస్యలతో బాధపడుతున్నారన్నారు. దంత సమస్యలతో బాధపడుతున్న వారు శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రవి కుమార్, విజయ్, రామోజీ, బాలాజీ, కిరణ్, మాధవ్, సాంబశివరావు, వెంకటేశ్వరరావు, గోపాల కృష్ణ, రాంరెడ్డి తదిరులు పాల్గొన్నారు.

కావ్య అవెన్యూ కాలనీ సర్వసభ్య సమావేశం

కావ్య అవెన్యూ కాలనీలో కాలనీ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కొలను వీరేందర్‌రెడ్డి కాలనీలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీకి మంజూరైన అభివృద్ధి పనులను త్వరాలోనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు విజయ్ కుమార్, ప్రసన్న బాబు, ప్రసాద్ ,మురళి , సరిత తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల సమస్య పరిష్కారం

రేణుక ఎల్లమ్మ కాలనీలో వీధి కుక్కలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా ఆయన కాలనీలో పర్యటించి సమస్యను తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన అధికారులు కుక్కలను పట్టుకెళ్లారు.

ఈ కార్యక్రమంలో 18 వార్డు బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కర్రె రాజేందర్, నాయకులు కదారి వెంకటేష్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని నిజాంపేట్ ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. నిజాంపేట్ ఫీడర్ పరిధిలో నిజాంపేట్ మెయిన్ రోడ్డు, హెరిటేజ్ లేన్, పాలంపల్లి విల్లాస్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు..

- శ్రీనివాసనగర్ ఫీడర్ పరిధిలోని శ్రీనివాసనగర్ హౌసింగ్ సొసైటీ, బాలాజీ మేడోస్, కేటీఆర్ కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అన్నదానం



సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్‌లోని సుబ్రహ్మణ్య ఆలయం వద్ద ప్రతిరోజు అన్నదానం నిర్వహిస్తారు. సోమవారం అన్నదానం కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి పాల్గొని మాట్లాడారు. నిత్యాన్నదానం చేయడం గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, మురళీకృష్ణ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మాస్కులు ధరించి జాగ్రత్త పడాలి

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్–19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం సూరారంకాలనీ యూపీహెచ్‌సీలో 22 మందికి పరీక్షలు నిర్వహించారు. అందరికీ నెగిటివ్ రిపోర్టులు వచ్చినట్లు వైద్యాధికారులు తెలియజేశారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా వైరల్ ఫీవర్లు విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బయటకు వెళ్లే సమయంలో మాస్కులు ధరించి జాగ్రత్త పడాలని ఎంహెచ్‌ఓ నిర్మల సూచించారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యం

గచ్చిబౌలి: మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని రాయదుర్గం ఎస్‌ఐ ప్రమోద్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం రాయదుర్గం సర్వే నంబర్ 83, నాలెడ్జిసిటీలోని ఐటీసీ కోహినూర్‌లో మహిళా దినోత్సవం సందర్భంగా 'మహిళల భద్రత–సైబర్ క్రైమ్'పై హోటల్‌లోని మహిళా సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ పని చేస్తున్న చోట, నివాసం ఉండే చోట లేదా ప్రయాణించే మార్గాల్లో ఎలాంటి వేధింపులకు గురైనా ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధితుల పేర్లను గోప్యంగా ఉంచుతారని వేధింపులకు పాల్పడిన వారి భరతం పడతామని ఆయన హెచ్చరించారు. షీ టీమ్ ట్విట్టర్, షీటీమ్ 9490617444, లేదా డయల్ 100కు ఫిర్యాదు చేయాలని సూచించారు. నకిలీ యాప్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌లతో మోసాలకు పాల్పడుతున్నారని అప్రమత్తంగా ఉండాలని మహిళలకు సూచించారు. సైబర్ క్రైం కేసులు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, అవగాహనతోనే కేసులు తగ్గుముఖం పడతాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సతీష్, షీ టీం సభ్యులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఔషధ ఆవిష్కరణలో 'ఏఐఅండ్ఎంఎల్' కీలకపాత్ర

రాయదుర్గం: ఔషధ ఆవిష్కరణలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ (ఏఐ అండ్ఎంఎల్) పాత్ర కీలకమని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్–సెంట్రల్ డ్రగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(సీఎస్ఐఆర్–సీడీఆర్ఐ) డైరెక్టర్ డాక్టర్ రాధారంగరాజన్ అన్నారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 'డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్–2023 ఏ వర్చువల్ వర్క్‌షాప్'ను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ నూతన ఔషధాల ఆవిష్కరణ, అపరిష్కృత వైద్య అవసరాలను గుర్తించడం, క్లినికల్ ట్రయల్స్‌ను వేగవంతం చేయడంలో ఏఐ అండ్ ఎంఎల్ ఉపయోగపడతాయన్నారు. గురుస్ బోర్డు చైర్మన్ కో ఫౌండర్, సీఈఓ డాక్టర్ జగత్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్ యువ పరిశోధకులు, ఔషధ ఆవిష్కరణలో వారి నైపుణ్యాలు, జ్ఞానాన్ని మెరుగుపర్చడానికి ఒక వేదికను అందిస్తుందన్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్ (ఎఫ్ఏబీఏ) ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ పి రెడ్డన్న, డాక్టర్ అజిత్ కామత్, హెచ్‌సీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ బిందు మాధవరెడ్డి తదితరులు ప్రసంగించారు.

మనూలో యునానీ హెల్త్ క్యాంప్

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ సూచించారు. యూనివర్సిటీ రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ, నేషనల్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యునానీ మెడిసిన్ ఫర్ స్కిన్ డిజార్డర్స్ (ఎన్ఆర్ఐయూఎంఎస్‌డీ)హైదరాబాద్‌తో కలిసి సోమవారం యునానీ హెల్త్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ వ్యాయామం, వాకింగ్, సైక్లింగ్ చేయాలని సూచించారు. ఆరోగ్యంగా ఉంటేనే చదువు, ఉద్యోగం, ఇతర విధులను సక్రమంగా చేయడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. సాంప్రదాయ, ప్రత్యామ్నాయ వైద్యం యొక్క ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయన్నారు. కాగా క్యాంపస్‌లో యునానీ పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేస్తామని ఎన్ఆర్ఐయూఎంఎస్‌డీ ఇన్‌చార్జ్ డైరెక్టర్ డాక్టర్ అహ్మద్ మిన్హాజుద్దీన్ వెల్లడించారు.

అధికారులు తిరస్కరించారు..

కాలనీవాసులు నిర్మిస్తున్నారు

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ ఏపీహెచ్‌బీకాలనీ ముఖద్వారంలో ఇసుక, కంకర లోడ్ల లారీలను రోడ్డుపై నిలుపుతున్నారు. దీంతో ఇతర వాహనాల రాకపోకలు ఇబ్బందికరంగా మారుతోంది. డివైడర్‌ను ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని సర్కిల్ అధికారులకు విన్నవించారు. అంతర్గత రోడ్లపై డివైడర్ల ఏర్పాటు తమ పరిధిలోకి రాదని తిరస్కరించారు. దీంతో కాలనీ సంక్షేమ సంఘం రూ.3లక్షల కాలనీ నిధులతో డివైడర్‌ను నిర్మించుకున్నారు. ఇప్పుడు లారీల పార్కింగ్‌కు అడ్డుకట్ట పడటంతో పాటు వాహనాలు సాఫీగా వెళ్లేందుకు వీలు కలుగుతుందని సంక్షేమ సంఘం ప్రతినిధులు పేర్కొంటున్నారు. అయితే రోడ్డు డివైడర్‌కు కాలనీ నిధులను వెచ్చించడంపై పలువురు పెదవి విరుస్తున్నారు.



ఏపీహెచ్‌బీ కాలనీలో నిర్మిస్తున్న డివైడర్

ఇప్పటికీ వినియోగంలోనే...



మగ్దూంనగర్ ప్రధాన రహదారిలో..

జగద్గిరిగుట్ట: ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ పెట్టుకోవడంతో అప్పట్లో వేసిన చేతి పంపులు కూడా దాదాపు అన్ని కనుమరుగు అయ్యాయి. 20 ఏళ్ల క్రితం మగ్దూంనగర్‌లో వేసిన చేతిపంపు ఇప్పటికీ వినియోగంలో ఉండటం విశేషం. తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పాడినప్పుడు ఈ చేతిపంపు ఎంతో ఉపయోగపడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.

కబ్జా కోరల్లో ప్రభుత్వ భూమి

జగద్గిరిగుట్ట: సర్వే నం.348.01లోని ప్రభుత్వ భూమి కబ్జాకు గురికాకుండా చూడాలని రాజీవ్ గృహకల్ప రజక కో–ఆపరేటివ్ సొసైటీ వారు కోరుతున్నారు. ఈ విషయమై గత నెల 22వ తేదీన ఎమ్మార్వోకు వినతి పత్రం ఇచ్చామని.. ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదని వాపోయారు. ముఖ్యంగా రాజీవ్ గృహ కల్ప 54వ బ్లాక్‌కు ఆనుకొని శ్రీ రాజరాజేశ్వరి ఆలయ సమీపంలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డును సైతం లెక్క చేయకుండా కొంత మంది వ్యక్తులు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు.



81 శాతం పోలింగ్

ఉదయం హడావిడి... మధ్యాహ్నం మందకొడిగా..

- పోలింగ్ కేంద్రాలను సందర్శించిన డీసీపీ
- జీడిమెట్ల పోలీసుల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు

కుత్బుల్లాపూర్: రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఉన్న రెండు పోలింగ్ స్టేషన్లలో 81 శాతం పోలింగ్ అయ్యింది. మొత్తం 1067 ఓటర్లు ఉండగా 869 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 198 మంది ఓటు వేయలేదు. ఉదయం నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరిగింది. ఉదయం పెద్ద ఎత్తున తమ ఓటు హక్కును వినియోగించుకోగా మధ్యాహ్నం సమయంలో మందకొడిగా సాగింది.

- ఈ సందర్భంగా జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ పవన్ ఆధ్వర్యంలో ఇద్దరు ఎస్సైలు 20 మంది సిబ్బందితో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు, ఏసీపీ గంగారాం, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి బందోబస్తును పర్యవేక్షించారు.
- ఎన్నికల అధికారిగా వ్యవహరించిన మండల తహసీల్దార్ సంజీవరావు రెండు పోలింగ్ కేంద్రాల్లో ఉన్న సిబ్బందితో సమన్వయం చేస్తూ ముందుకు సాగారు. కాంగ్రెస్, బీజేపీ, ఇతర పక్షాల నాయకులు పోలింగ్ కేంద్రం వద్ద స్లిప్పుల పంపిణీ చేసి తమ అభ్యర్థిని గెలిపించాలని ఉపాధ్యాయులను వేడుకోవడం కనిపించింది. సాధారణ ఎన్నికలను తలపించే విధంగా మద్యం, డబ్బు విచ్చలవిడిగా పంపిణీ చేశారని ప్రధాన పార్టీల నాయకులు ఆరోపించారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సంజీవరావు



ఓటు హక్కును వినియోగించుకున్న ఓటర్లు

హాథ్ సే హాథ్ జోడో

కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమమే పరమావధిగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా సోమవారం ఆయన సూరారం కాలనీ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా సంజయ్‌గాంధీనగర్, ఏడుగుళ్లు, మార్కండేయ నగర్, నెహ్రూనగర్ తదితర ప్రాంతాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ పార్టీలు మరోసారి ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకి రావాలని చూస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్యాస్ సిలిండర్‌ను రూ.500లకే అందిస్తామన్నారు. అదే విధంగా కరెంట్, ఇతర చార్జీలు తగ్గిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, ఆల్ ఇండియా దళిత సేన అధ్యక్షుడు ఆవిజె జేమ్స్, సిద్ధనోళ్ళ సంజీవరెడ్డి, పండరిరావు, మాత్రి సంతోష్‌ముదిరాజ్, పరుష శ్రీశైలంయాదవ్, సంపంగి వెంకటేష్, సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

లీడింగ్ స్వచ్ఛత ఉత్సవ్ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

దుండిగల్: మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ కనబరిచిన మగువలకు 'మహిళ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత ఉత్సవ్–2023' అవార్డులు ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. దాని కోసం మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరావు పేర్కొన్నారు. తెలిపారు. వ్యక్తిగత, స్వయం సహాయక, చిన్న తరహా, స్టార్టప్, ఎన్‌జీవోలతో పాటు సామాజిక రవాణ, డీఆర్‌సీసీ కేంద్ర నిర్వహణ, చెత్తతో కళావృత్తులు, తడిచెత్తను వినియోగించుకోవడంలో ఆసక్తి గల మహిళలు ఈనెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవార్డులను జూన్ 5న ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం.95427 15377లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ అధికారి, అంజయ్య, సాత్విక్, సీఓ మంజుల, మహిళా రిసోర్స్ పర్సన్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న దుండిగల్ మున్సిపాలిటీ అధికారులు

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

నిజాంపేట్: అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. సోమవారం నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయంలో అభివృద్ధి పనుల విషయమై ఆయా విభాగాల అధికారులతో మేయర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎస్ఎన్‌డీపీ నాలా పనులు, బాచుపల్లి రోడ్డు విస్తరణ, బస్తీ దవాఖానాలు, ఓపెన్ జిమ్స్, క్రీడా ప్రాంగణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని సూచించారు. అదే విధంగా పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త తరలింపులో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. ఈ సమావేశంలో ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటరీ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి

మనూలో 'సూడాన్' బృందం

రాయదుర్గం: సూడాన్ దేశంలోని వైట్‌నైల్ యూనివర్సిటీ ప్రతినిధి బృందం సోమవారం గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది.వీసీ సయ్యద్ ఐనుల్ హసన్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు. వైట్‌నైల్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎల్హాజలి ఈ సాహమద్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం రెండు విశ్వవిద్యాలయాల మధ్య సహకారం, సంభావ్యతపై చర్చించారు.

మహిళల రక్షణపై సింపోజియం

రాయదుర్గం: డిజిటల్ స్పేస్‌లో మహిళల రక్షణపై మనూలో నేడు ప్రత్యేక సింపోజియంను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు డీడబ్ల్యూ హెడ్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ అమీనా తహసీన్ తెలిపారు. 'లింగ సమానత్వం, డిజిటల్‌లో మహిళల రక్షణ' అనే అంశంపై మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు క్యాంపస్‌లోని సయ్యద్ హమీద్ లైబ్రరీ ఆడిటోరియంలో సింపోజియం నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

డిజిటల్ ఆవిష్కరణల రూపకల్పనకు..

నాలెడ్జి సిటీలో అలైన్ ఇన్నోవేషన్ సెంటర్

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జిసిటీలోని సలార్‌పురియా సత్వా నాలెడ్జ్ పార్కులో అలైన్ ఇన్నోవేషన్ సెంటర్‌ను సోమవారం ప్రారంభించారు. అలైన్ టెక్నాలజీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, చీఫ్ డిజిటల్ ఆఫీసర్ శ్రీలక్ష్మీ కొల్లి, సీనియర్ డైరెక్టర్, సెంటర్ జీఎం శ్రీనితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇండస్ట్రీకి చెందిన ప్రతిభావంతులను ఒకచోటకు చేర్చి డిజిటల్ ఆవిష్కరణలను నడిపించడంలో ఈ ఇన్నోవేషన్ సెంటర్ సహాయపడుతుందన్నారు. అలైన్ డిజిటల్ ప్లాట్‌ఫారమ్ డిజిటల్ డెంటిస్ట్రీ, ఆర్థోడాంటిక్స్‌ను అభివృద్ధి చేసి ఆవిష్కరణలను రూపొందించడానికి మా భాగస్వాములు కస్టమర్లతో కలిసి పనిచేయడానికి ఎదురు చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులందరూ ఐక్యమత్యంతో హక్కులు సాధించుకోవాలి

జగద్గిరిగుట్ట: కార్మికులు ఐక్యమత్యంతో ఉంటేనే సమస్యలు పరిష్కారమవుతాయని భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు సాయులు అన్నారు. శ్రీనివాస్‌నగర్‌లో సోమవారం మార్బుల్స్ టైల్స్ వర్కర్స్ యూనియన్ ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా సాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులందరూ ఐక్యమత్యంతో ఉద్యమించి హక్కులు సాధిచుకోవాలన్నారు. అదే విధంగా ప్రభుత్వ ముంజూరు చేస్తున్న ఇన్సూరెన్స్ కార్డులను ప్రతి కార్మికుడు తీసుకోవాలన్నారు. ప్రతి అమావాస్య రోజు పనులు నిలిపివేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో యూసుఫ్, జహంగీర్, నజీర్ గౌస్, సాయిబాబా, రాజు, యాదగిరి, ఫయిం, మొరజ్, రవి, మాజిద్, ఇర్ఫాన్, పాషా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో హాజరైన కార్మికులు

వైద్యులు పనితీరును మెరుగుపరుచుకోవాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్

సాక్షి,మేడ్చల్ జిల్లా: బస్తీ దవాఖానాల్లో వైద్యాధికారులు, వైద్యులు పనితీరును మరింతగా మెరుగుపరుచుకుని మంచి పేరు తెచ్చుకునేలా ప్రజలకు వైద్య సేవలు అందించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ కోరారు. కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సోమవారం జిల్లా డిప్యూటీ వైద్య ఆరోగ్య శాఖాధికారులు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానా వైద్యులతో ఆయన జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని డయాగ్నోస్టిక్స్ సెంటర్ల సేవలు, టెలీ కాన్సులేషన్, అవుట్ పేషెంట్ మాడ్యూల్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల అందజేత వంటి విషయాలను డీఎంహెచ్‌ఓ అడిగి తెలుసుకున్నారు. కొత్త వైరస్‌లు, అంటువ్యాధులు ప్రబల కుండా వైద్యాధికారులు అహర్నిశలు కష్టపడుతున్నారని కొనియాడారు. కోవిడ్ నేపథ్యంలో ప్రజలు తమవంతు బాధ్యతగా వ్యాక్సిన్ వేయించుకోవడంతో పాటు సామాజిక దూరం పాటించి, తప్పనిసరిగా మాస్కులు ధరించాలని సూచించారు. క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవాలని, శానిటైజర్లు వాడటం మరిచిపోవద్దన్నారు. సీఆర్‌పీలో శిక్షణ పొందేందుకు వైద్య సిబ్బందిని గుర్తించడంతో పాటు కార్యాచరణ ప్రణాళిక, శిక్షణా షెడ్యూల్‌ను ఖరారు చేయాలని సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. ప్రతి మాస్టర్ ట్రైనర్‌కు సంబంధించి ఒక్కో బ్యాచ్‌కి 20 చొప్పున 3 బ్యాచుల్లో నిత్యం 60 మంది వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని, దీనికి ప్రోగ్రామ్ ఆఫీసర్ డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ టీమ్‌కు నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచాలని, ప్రతీ ఆరోగ్య కేంద్రం వద్ద యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అండ్ యాంటీ స్నేక్ వెనమ్ స్టాక్‌లను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ప్రజారోగ్య కార్యక్రమాలపై వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తీవ్రంగా పరిగణించి చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్ హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్

హెచ్‌ఏఎల్‌కాలనీ అధ్యక్షుడిగా కమలాకర్

కుత్బుల్లాపూర్: హెచ్ఏఎల్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా కమలాకర్ (అడ్వకేట్) ఐదోసారి విజయం సాధించారు. ఆదివారం రాత్రి జరిగిన ఎన్నికల్లో అధ్యక్షులుగా ఉప్పల అనిల్‌కుమార్ (89)తో పాటు కమలాకర్ పోటీ పడ్డారు. దీంతో 92 ఓట్ల మెజార్టీతో కమలాకర్ విజయం సాధించాడు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కమలాకర్ మాట్లాడుతూ.. త్వరలోనే పూర్తి కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని పేర్కొన్నారు. కాలనీ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఎన్నికలు నామమాత్రమేనని ఈ ప్రాంత అభివృద్ధిలో అందరూ ఒకటేనని స్పష్టం చేశారు.



అధ్యక్షుడిగా గెలుపొందిన కమలాకర్‌తో హెచ్‌ఏఎల్ కాలనీవాసులు

పంచాయతీ కార్మికులకు వేతనాలు వెంటనే చెల్లించాలి



సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

- పంచాయతీ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నేత శ్రీనివాస్
- కార్మికులచే కలెక్టరేట్ ఎదుట ధర్నా

సాక్షి,మేడ్చల్ జిల్లా: గ్రామ పంచాయతీ కార్మికులకు ఐదు నెలల నుంచి వేతనాలు ఇవ్వకపోవడంతో వారి కుటుంబాలు పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, వెంటనే వారి వేతనాలు చెల్లించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా గ్రామ పంచాయతీ కార్మికుల ధర్నా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం.. డబుల్ బెడ్రూమ్ ఇళ్లు పంచాయతీ కార్మికులకు ఇవ్వాలని, కార్మికులకు మల్టిపుల్ వర్క్ విధానాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కోశాధికారి ఉన్ని కృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్ర కార్మిక మంత్రిగా ఉన్న జిల్లా మంత్రి మల్లారెడ్డి గ్రామ పంచాయతీ కార్మికులకు ఐదు నెలలుగా జీతాలు ఇవ్వకపోయినా పట్టించుకోకపోవడం దారుణమని, కార్మికుల సమస్యలపై మంత్రి వెంటనే స్పందించాలన్నారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా నాయకులు రవి, మల్లయ్య, సుధాకర్, లక్ష్మమ్మ, పద్మ, శ్రీను యాదయ్య, గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక స్థలం నాదే..

- హైకోర్టు ఆర్డర్‌తో సర్వేకు వచ్చిన అధికారులు
- కేసు వేసిన వ్యక్తి, గ్రామస్తుల మధ్య వాగ్వాదం

సుభాష్‌నగర్: ప్రస్తుతం శ్మశానవాటిక ఉన్న స్థలం తనదే అంటూ.. ఆ స్థలంలో సర్వే నిర్వహించాలని ఓ వ్యక్తి హైకోర్టు ద్వారా ఆర్డరు తీసుకురావడంతో స్థానికులు సదరు వ్యక్తిపై మండిపడ్డారు. సూరారం గ్రామానికి చెందిన జయప్రకాశ్‌రెడ్డి కట్ట మైసమ్మ ఆలయ సమీపంలో ప్రధాన రహదారి ఆనుకొని సర్వే నం.35లో తనకు ఎకరా 30గుంటల స్థలం ఉందంటూ గతంలో హైకోర్టును ఆశ్రయించారు. అంతే కాకుండా సదరు స్థలంలో సర్వేనిర్వహించి సదరు స్థలాన్ని తనకు కేటాయించాలని హైకోర్టు ద్వారా ఆర్డర్ తీసుకువచ్చాడు. ఈ మేరకు సోమవారం తహసీల్దారు సంజీవరావు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకుని సర్వే చేపట్టేందుకు సన్నద్ధమయ్యారు.



సర్వేయర్ సునీతతో మాట్లాడుతున్న తహసీల్దారు సంజీవరావు


- విషయం తెలుసుకున్న సూరారం గ్రామస్తులు అక్కడకు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఏళ్ల నుంచి సదరు స్థలాన్ని శ్మశానవాటిక కోసం వాడుతున్నామని... ఇప్పుడు ప్రైవేటు స్థలమని అనడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసు వేసిన వ్యక్తి వారి అనుచరులతో కలిసి గ్రామస్తులతో వాగ్వాదానికి దిగాడు. ఇరు వర్గాల మధ్య గొడవ జరుగుతుండటంతో దుండిగల్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వారితో మాట్లాడారు. ఈ విషయమై తహసీల్దారు సంజీవరావు మాట్లాడుతూ.. సదరు స్థలంలో శ్మశానవాటిక ఎన్ని రోజులుగా కొనసాగుతుందో నివేదిక ఇవ్వాలని గ్రామస్తులకు చెప్పి వెళ్లిపోయారు.

పెండింగ్ పనులను త్వరలో పూర్తి చేస్తాం

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి దిశగా పయనిస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతి యాత్రలో భాగంగా సోమవారం ఆయన జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని సంజయ్‌పురికాలనీ, జగద్గిరినగర్ ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించి స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైనేజీ పనుల విషయమై అడుగగా వెంటనే ప్రారంభించి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

- అనంతరం ఆయన మాట్లాడుతూ... డివిజన్ల పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీల్లో ఇప్పటికే అభివృద్ధి పనులు పెద్దమొత్తంలో పూర్తి చేశామన్నారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా పని చేస్తున్నామని పేర్కొన్నారు. జగద్గిరినగర్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్, సెక్రటరీ చిన్న, సురేష్, ద్రోణాచారి తదితరులు పాల్గొన్నారు.
- గాజులరామారం డివిజన్ బాలయ్యనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు పేట్‌బషీరాబాద్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి తమ ప్రాంతంలో కమ్యూనిటీహాలు, బస్తీ దవాఖానా, గ్రేవ్ యార్డులను కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్, ఆర్డీఓల దృష్టికి తీసుకువెళ్లి స్థలాలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యే వివేకానంద్‌కు వినతి పత్రం అందజేస్తున్న బాలయ్యనగర్‌వాసులు